ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యమివ్వండి

డీజీపీ జితేందర్

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ) : పోలీసులకు సంబంధించి ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులకు కమిషనర్లు, ఎస్పీలు, పోలీసు ఉన్నతాధికారులు ప్రాధాన్యమివ్వాలని డీజీపీ జితేందర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన వారితో డీజీపీ ఆఫీసులో జితేందర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్లలో వచ్చే ఫిర్యాదుల ఆధారంగా వెంటనే కేసులు నమోదు చేయాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసు కమిషనర్లు, ఎస్పీలు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. తాను కూడా త్వరలోనే జిల్లాల వారీగా తనిఖీలు చేపడుతానని వెల్లడించారు. హిస్టరీ షీట్‌లు సమీక్షించాలని, ఆయుధాల లైసెన్స్ జారీపై జాగ్రత్త వహించాలని, శాంతి భద్రతల నిర్వహణ, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. 'నేను సైతం' కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించడంతోపాటు రోడ్డు భద్రత ప్రాముఖ్యత, రాష్ట్రంలో డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరాన్ని వివరించారు. స్టేషన్ హౌస్‌ఆఫీసర్ల పనితీరును అంచనా వేసేందుకు నేర సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

తిరుమలలో ఏఐ నిఘా

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ) : తిరుమలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత నిఘా ఏర్పాటు చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిర్ణయించింది. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సంచారం, భక్తుల సంఖ్య, సర్వదర్శనం, గదుల అద్దె తదితర విషయాల్లో అక్రమాలను కట్టడిచేయడంలో ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని భావిస్తోంది. ఈ మేరకు ఈ టెక్నాలజీని సరఫరా చేసే ఔత్సాహిక సంస్థల నుంచి టీటీడీ టెండర్లు ఆహ్వానిస్తోంది. ఈనెల 31లోగా ఔత్సాహికులు తమ పరికరాలను ప్రదర్శించి, టెండర్లలో పాల్గొనాలని టీటీడీ పేర్కొంది. తిరుమలలో శ్రీవారి దర్శనానికి వచ్చే మార్గం నుంచి క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లు, భక్తుల ముఖ గుర్తింపు, టోకెన్ల జారీ వంటి అన్ని రికార్డు చేసే విధంగా ఈ టెక్నాలజీని వినియోగించనున్నారు.

గురుకుల విద్యార్థిని అనుమానాస్పద మృతి

- సూర్యాపేట జిల్లాలో ఘటన

పెన్‌పహాడ్/సూర్యాపేట టౌన్/బొడ్రాయిబజార్, జూలై 16: సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మాచినపల్లికి చెందిన కొంపల్లి సోమయ్య, స్వరూప దంపతుల చిన్న కూతురు సరస్వతి(10) పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ పూలే గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నది. సరస్వతి సోమవారం నుంచి జ్వరంతో బాధపడుతున్నది. మంగళవారం జ్వరం ఎక్కువ కావడంతో జీఎన్ఎం, ఉపాధ్యాయురాలు ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అందించినా జ్వరం తగ్గకపోవడంతో 108 ద్వారా సూర్యాపేట జనరల్ దవాఖానకు తరలించారు. చికిత్స అందించేలోపే సరస్వతి మృతిచెందినట్టు అక్కడి వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న సరస్వతి తల్లిదండ్రులు.. దవాఖానకు చేరుకొని విగత జీవిగా పడి ఉన్న తమ కూతురును చూసి భోరున విలపించారు. జతమ బిడ్డ మరణానికి పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని సోమయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై రవీందర్ తెలిపారు.

2 లక్షల సాయం: కోమటిరెడ్డి

విద్యార్థిని సరస్వతి మరణంపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించారు. మృతికి గల కారణాలపై విచారణ జరపాలని గురుకుల విద్యాసంస్థల సెక్రటరీ సైదులును ఆదేశించారు. సరస్వతి కుటుంబానికి రూ.2 లక్షల తక్షణ ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.

విద్యార్థిని బలవన్మరణం

గుండాల, జూలై 16 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం సాయనపల్లిలో తోలెం నిహారిక (13) కస్తూర్బాలో 8వ తరగతి చదువుతున్నది. రెండు రోజుల క్రితం హోమ్ సిక్‌నెస్‌తో ఇంటికి వచ్చింది. పాఠశాలకు వెళ్లాలని కుటుంబ సభ్యులు మంగళవారం మందలించడంతో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ దబాఖానకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజమౌళి తెలిపారు.

వైద్యుల కోసం రోగుల పడిగాపులు

సకాలంలో వైద్య సేవలు అందక వరంగల్ కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో రోగులు అవస్థలుపడ్డారు. మంగళవారం ఉదయం 10 దాటినా ఓపీ సేవలు ప్రారంభం కాకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు ఓపీ చీటీలు చేతిలో పట్టుకొని డాక్టర్ల గదుల వద్ద పడిగాపులు పడ్డారు. క్యూలో నిలబడే ఓపిక లేక ఇలా కింద కూర్చుండిపోయారు. – వరంగల్ చౌరస్తా

రేషన్‌కార్డు లేకున్నా ఆరోగ్యశ్రీ

- **కలెక్టర్లు రూపొందించి అమలు చేయాలి**
- **ప్రభుత్వానికి సారథులు.. వారధులు కలెక్టర్లే**
- **కలెక్టర్లు, ఎస్పీలు, సీపీల సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి**

కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ప్రాధాన్యాలతోపాటు ప్రజా ప్రయోజనాలను అర్థం చేసుకొని పని చేయాలని కలెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. తమ ప్రభుత్వం పారదర్శకంగా ప్రజాహిత పాలనను అందించటంతోపాటు సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నదని తెలిపారు. మంగళవారం సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి కండ్లు, చెవులు, జిల్లా స్థాయిలో వారధులు, సారథులు కలెక్టర్లేనని చెప్పారు. కలెక్టర్లు ఏ జిల్లాలో పనిచేసినా ప్రజల మదిలో చెరగని ముద్ర వేయాలని సూచించారు. తెలంగాణలో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల అధికారులు భాష నేర్చుకుంటే సరిపోదని, తెలంగాణ సంస్కృతిలో భాగం కావాలని కోరారు. తెలంగాణను సొంత రాష్ట్రంగా భావించి పని చేయాలని అన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేర్చే బాధ్యత కలెక్టర్లదేనని వెల్లడించారు.

క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే

అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రజలతో మాట్లాడాలని, అక్కడికక్కడ పరిష్కారమయ్యే చిన్న చిన్న పనులను వెంటనే చేయించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, దవాఖానలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం నెలకు రూ.85 వేలు ఖర్చు చేస్తున్నదని చెప్పారు. మధ్యాహ్న భోజనం మరింత మెరుగ్గా అందించేందుకు హరే కృష్ణ మూవ్‌మెంట్ వంటి సంస్థల సహకారం తీసుకోవాలని ఆదేశించారు.
- ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేసే బాధ్యత కలెక్టర్లపైనే ఉన్నదని అన్నారు.
- పెండింగ్ ధరణి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలన్నారు.
- రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల్లో 64 లక్షల మంది సభ్యులున్నారని, కోటి మంది సభ్యులుగా చేరేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీరిదిద్దేలా ఐదేండ్లలో రూ.లక్ష కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించే లక్ష్యంతో పని చేయాలని అన్నారు.
- గిరిజనులకు ఆదాయం లేకే పోడు వ్యవసాయంపై ఆధారపడుతున్నారని, వారికి పట్టాలు ఇచ్చిన భూముల్లో పండ్ల మొక్కలు నాటిస్తే వారికి ఆదాయం వస్తుందన్నారు. డ్రోన్ల ద్వారా ఏరియల్ సర్వే చేయించి, ఖాళీ భూములను గుర్తించి ఆ నేలల్లో పెరిగే పండ్ల మొక్కలు నాటించాలని ఆదేశించారు. వన మహోత్సవంలో నాటే మొక్కలు 50 ఏండ్లు ఫలసాయం అందించేలా ఉండాలని స్పష్టం చేశారు.
- ప్రాజెక్టు కట్టలు, కాల్వ కట్టలు, రహదారుల వెంట తాటి, ఈత చెట్లు నాటాలని, మూడు, నాలుగేండ్లలో గీత వృత్తిదారులకు ఆదాయం వచ్చేలా హైబ్రిడ్ మొక్కలు నాటాలని తెలిపారు.
- ప్రతి నియోజకవర్గంలో 20–25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని, నియోజకవర్గంలో రహదారులకు అనుసంధానంగా ఉండే గ్రామాలు, పట్టణాల్లో స్థలాలను ఎంపిక చేయాలని సూచించారు. రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు.
- కల్తీ పురుగు మందులు, ఎరువులు, విత్తనాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. రాష్ట్రానికి అవసరమైన ఎరువులు, యూరియా సిద్ధంగా ఉన్నాయని చెపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ వద్దు

శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడొద్దని పోలీసు అధికారులకు సీఎం సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ బాధితులతోనే తప్ప నేరస్థులతో కాదని గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు. డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపాలని తేల్చి చెప్పారు. పోలీసు, ఎక్సైజ్, టీజీ న్యాబ్ సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని సూచించారు.

ప్రతి ఒక్కరికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్

రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని నిర్ణయం తీసుకున్నామని సీఎం చెప్పారు. రాష్ట్రంలో అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులను అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో వైద్య సేవలందించే ఆర్ఎంపీ, పీఎంపీలకు ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వాలన్న డిమాండ్ ఉన్నదని, అధ్యయనం చేసి అందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. సదస్సులో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కొండా సురేఖ, ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి , సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్ పాల్గొన్నారు.

మీరంతా ఏం చేస్తున్నట్టు?

కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వరుసగా నిరసనలు, ధర్నాలు జరుగుతుండటంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. తాజాగా సచివాలయంలో పలువురు మంత్రులను పిలిపించుకొని సమావేశమైనట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వివిధ వర్గాలు ధర్నాలు చేస్తున్నా, కొన్ని సంఘాలు సచివాలయం ముట్టడిస్తున్నా ఎందుకు ఖండించడం లేదని అడిగినట్టు తెలిసింది. డీఎస్సీ, గ్రూప్స్ పోస్టులు, రుణమాఫీపై ఇంత రచ్చ జరుగుతున్నా సంబంధిత మంత్రులు ఎందుకు స్పందించడం లేదని అడిగినట్టు సమాచారం. ప్రెస్‌మీట్ ద్వారానో, ప్రెస్‌నోట్ రూపంలోనో, చర్చల ద్వారానో వారి అనుమానాలను ఎందుకు నివృత్తి చేయలేకపోతున్నారని ఆరా తీసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే డీఎస్సీ, గ్రూప్స్ పోస్టులపై ఓ మంత్రి ప్రెస్‌మీట్ పెట్టగా, రుణమాఫీపై మరో మంత్రి వరుసగా ప్రెస్‌నోట్‌లు, చిట్‌చాట్‌లు నిర్వహిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

సీఎం తొలి ఏకాదశి శుభాకాంక్షలు

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలి ఏకాదశి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఏకాదశి పండుగను ప్రతి ఇంటా ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

హైదరాబాద్‌లో ఈ హత్యలేంది?

- **తరచూ కాల్పులెందుకు జరుగుతున్నయ్?**
- **'డయల్ 100' స్పందన ఎందుకు పడిపోయింది?**
- **రెండు నెలల్లో పోలీసింగ్ వ్యవస్థ గాడిన పడాలి**
- **నగర సీపీ కొత్తకోటకు సీఎం రేవంత్‌రెడ్డి తలంటు**
- **డ్రగ్స్ కట్టడిపై సందీప్ శాండిల్యకు ప్రశంసలు**

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతల తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలిసింది. నగరంలో హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, స్నాచింగ్‌లు, కాల్పులు పెరగడం, పోలీస్ యంత్రాంగం వైఫల్యంపై నిత్యం పత్రికల్లో కథనాలు రావడంపై అసహనం వ్యక్తంచేసినట్టు సమాచారం. రాష్ట్రంలోని కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం సదస్సు నిర్వహించారు. ఇందులో హైదరాబాద్ నగర శాంతి భద్రతల అంశం వచ్చినపుడు హాట్‌హాట్‌గా చర్చ జరిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ముఖ్యంగా నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డికి సీఎం వేసిన వరుస ప్రశ్నలకు ఆయన నుంచి సరైన సమాధానాలు రాలేదని తెలిసింది. 'హైదరాబాద్‌లో వరుసగా హత్యలు జరగడమేంటి? తరచూ కాల్పులు ఎందుకు జరుగుతున్నయ్?



శ్రీనివాస్‌రెడ్డి

డయల్ 100 స్పందన సమయం ఎందుకు పడిపోయింది?' అని సీఎం ప్రశ్నించగా సీపీ శ్రీనివాస్‌రెడ్డి పొంతనలేని సమాధానాలు చెప్పారని తెలిసింది. కమిషనరేట్‌లో ఐటీ సెల్ ఎందుకు సరిగా పని చేయడంలేదని సీఎం ఆరాతీశారని, ప్రజా సంబంధాల్లో ఎందుకు విఫలమవుతున్నారో చూసుకోవాలని సీపీకి సీఎం సూచించారని సమాచారం. గతంలో రంజాన్ సందర్భంగా మీడియాకు గిఫ్ట్‌లు ఇచ్చేవారని, ఈసారి కూడా తనను అడిగితే ఇవ్వనందున వ్యతిరేక వార్తలు వస్తున్నాయని సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి చెప్పగా సీఎం సంతృప్తి చెందలేదని తెలిసింది. నగరంలో పోలీసింగ్ అనేది ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుందని, రెండు నెలల్లో నగర పోలీసింగ్ వ్యవస్థ గాడిన పడాలని సీఎం ఆదేశించినట్టు సమాచారం. సైబరాబాద్ పరిధిలో కొంతకాలం కిందట కుమారి ఆంటీ మెస్‌ను పోలీసులు తొలగిస్తే అది తానే చేసినట్టుగా ప్రజల్లోకి వెళ్లిందని, అలాంటి చర్యలు తీసుకునేముందు ఆలోచించాలి కదా! అని సీఎం సున్నితంగా మందలించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

ఖర్గే పేరిట ఫేక్ మెసేజ్‌ను చూపిన సీఎం

సైబర్ క్రైం విభాగం ఎందుకు సరిగా పనిచేయడం లేదని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్, అదనపు డీజీ అయిన సీపీ శిఖా గోయల్‌ను సీఎం ప్రశ్నించినట్టు తెలిసింది. పక్కనే ఉన్న ఓ మంత్రి మొబైల్ తీసుకొని అందులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేరుతో ఉన్న ఫేక్ మెసేజ్‌ను చూపినట్టు సమాచారం. ప్రస్తుతం ఖర్గే అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతున్నారని, ఆయన దగ్గర ఫోన్ కూడా లేదని, అయినా ఇలా మెసేజ్‌లు వస్తున్నాయని సీఎం అనడంతో అలాంటివి సహజమేనని శిఖా గోయల్ సమాధాన మిచ్చినట్టు తెలిసింది. దీంతో అలా జరిగితే మీరేం చేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రశ్నించగా ఆమె మిన్నకుండిపోయినట్టు సమాచారం. నైజీరియన్లు సైబర్ క్రైమ్‌కు ఎక్కువగా పాల్పడుతున్నారని శిఖా గోయల్ చెప్పగా వీసా గడువు ముగిసినా నగరంలో వాళ్లు ఎందుకు ఉంటున్నారు? గుర్తించి చర్యలు తీసుకోవాలి కదా! అని సీఎం ప్రశ్నించడంతో అధికారులు తెల్లమొహం వేసినట్టు తెలిసింది. సమర్థులైన అధికారులు అని ఏరికోరి తెచ్చుకున్నానని, కానీ ఆశించిన స్థాయిలో పనితీరు కనిపించడంలేదని సీఎం అసంతృప్తి వ్యక్తంచేశారని, పనితీరు మెరుగుపడకుంటే కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని కూడా సీఎం హెచ్చరించారని సమాచారం. రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడి కోసం తీసుకుంటున్న చర్యలపై టీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య ప్రత్యేకంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వగా సీఎం ప్రశంసించినట్టు తెలిసింది.



శిఖా గోయల్

సందీప్ శాండిల్య

సమగ్ర సమాచారంతో రాని అధికారులు..

సీఎం రేవంత్ రెండో పర్యాయంగా నిర్వహించిన కలెక్టర్లు, ఎస్పీల సదస్సు నాన్ సీరియస్‌గా జరిగిందని పలువురు అధికారులు అభిప్రాయపడ్డారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు జరిగిన సదస్సులను పోలుస్తూ వారు ఈ అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. కేసీఆర్ అధికారులకు వేసే ప్రశ్నలు సూటిగా ఉండేవని, ముఖ్యంగా అంశాలపై లోతుగా చర్చించేవారని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కలెక్టర్లు, ఎస్పీలు కూడా సమగ్ర వివరాలతో సదస్సుకు హాజరయ్యేవారని, కానీ ఇప్పుడు అలా వచ్చినట్టు కనిపించడంలేదని, సీఎం అడిగిన ప్రశ్నలకు సాదాసీదాగా సమాధానాలివ్వడంతో సదస్సు ఆద్యంతం తేలిపోయినట్టుగా సాగిందని చెప్పారు.

ప్రభుత్వ భూములను కాపాడండి: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ) : వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనా అధికారులు స్పందించకపోవడంపై ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కోట్ల విలువైన భూములను కబ్జాదారులు ఆక్రమించిన విషయాన్ని ప్రస్తావిస్తూ మంగళవారం ఆయన ఉన్నతాధికారులకు లేఖ రాశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ఫిర్యాదును ప్రస్తావిస్తూ ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఉదాసీనత ప్రదర్శించిన అధికారులపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఖానామెట్ గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 41/14లోని 252.24 ఎకరాల భూమి ఉండగా, 2008లో అప్పటి ప్రభుత్వం 180.13 ఎకరాలను హుడా(ప్రస్తుత హెచ్ఎండీఏ)కు కేటాయించింది. అందులో నుంచి 75 ఎకరాలను పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ(ప్రస్తుత టీజీఐఐసీ)కు హుడా బదిలీ చేసింది. హుడా ఆధీనంలోని 105.13 ఎకరాలు, టీజీఐఐసీ యాజమాన్యంలోని 75 ఎకరాల్లో అత్యధిక భాగం కబ్జాదారుల ఆధీనంలోకి వెళ్లిందని శ్రీధర్‌బాబు ఆవేదన వ్యక్తంచేశారు. శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లోని 100, 101 సర్వే నంబర్లలోని 100 ఎకరాల భూమి కబ్జాకు యత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

తెలంగాణకు 5.4 టీఎంసీలు

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ) : నాగార్జునసాగర్ నుంచి తెలంగాణకు 5.414 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కేఆర్ఎంబీ ఆదేశించింది. బుధవారం నుంచి నీటిని వదలాలని ఉత్తర్వులు జారీ చేసింది.

'బదిలీలకు ముందు పదోన్నతులు ఇవ్వండి'

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ) : ట్రాన్స్‌కోలోని ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయడంతోపాటు ప్రస్తుత సిబ్బందిపై భారాన్ని తగ్గించాలని ఆ శాఖ సీఎండీని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్(టీఈఈఏ)కోరింది. మంగళవారం సీఎండీకి వినతిపత్రం అందజేశారు. బదిలీల కంటే ముందు పదోన్నతులు కల్పించాలని వేడుకున్నారు.

317 జీవో అమలు చేయకుండా బదిలీలెలా?

టీవీవీపీ ఉద్యోగుల విచిత్ర పరిస్థితి

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): బదిలీల్లో తమకు అవకాశం లేకుండా పోతున్నదని తెలంగాణ వైద్య విధాన పరిషత్తు(టీవీవీపీ)లోని జిల్లా క్యాడర్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీవీవీపీ పరిధిలో 317 జీవో అమలుకు ప్రభుత్వం గత జూలైలో ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు మల్టీజోన్, జోనల్ పోస్టులైన వైద్యులు, స్టాఫ్ నర్సులు ఇతర సిబ్బందికి ఆ జీవో అమలైంది, కానీ, జిల్లా స్థాయిలోని ల్యాబ్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్లు, డ్రైవర్లు, జూనియర్ అసిస్టెంట్ తదితర పోస్టులకు అమలు కాలేదు. దీంతో ప్రస్తుత బదిలీల్లో తమకు అవకాశం రాలేదని టీవీవీపీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటివరకు మూడు నాలుగు జిల్లాల్లోనే ప్రక్రియ పూర్తయిందన్నారు. దీనిపై కలెక్టర్లను అడిగితే.. 317 జీవో అమలైనవారికే బదిలీలుంటాయని చెప్తున్నారని, సంబంధిత మంత్రి రాజనర్సింహ తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

31 మంది పీపీలకు శాఖల కేటాయింపు

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం తరఫున కోర్టుల్లో వాదనలు వినిపించేందుకు 31 మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించి, వారికి శాఖలను కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రూ.20 వేల కోట్లకుపైగా మిగుల్చుతాం

- **రుణమాఫీ, రైతుభరోసాకు రూ.40 వేల కోట్లు చాలు**
- **కొర్రీలు పెడితే అంత మొత్తం కూడా అక్కర్లేదు**
- **ప్రభుత్వానికి ఆర్థిక, వ్యవసాయ అధికారుల సలహాలు**
- **అన్నట్టుగానే రుణమాఫీకి రేవంత్ సర్కారు కొర్రీలు**

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ రుణాల మాఫీ, రైతుభరోసా పథకాల అమలులో ఆర్థిక భారాన్ని ఏ విధంగా తగ్గించుకోవాలా అని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నది. దీంతో అందుకు అనుసరించాల్సిన మార్గాలను అధికారులు సూచించినట్టు సమాచారం. ఈ రెండు పథకాలకు అయ్యే మొత్తం ఖర్చులో రూ.20 వేల కోట్లకుపైగా భారాన్ని తగ్గిస్తామంటూ ఆర్థిక, వ్యవసాయ శాఖలకు చెందిన కొందరు అధికారులు ప్రభుత్వానికి భరోసా ఇచ్చినట్టు సచివాలయంలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. దీనిలో భాగంగానే రుణమాఫీలో భారీగా కోతలు పెట్టినట్టు తెలుస్తున్నది. వాస్తవంగా రుణమాఫీకి రూ.39 వేల కోట్లు, రైతుభరోసాకు రూ.23 వేల కోట్లు కలిపి ఈ రెండు పథకాల అమలుకు మొత్తం రూ.62 వేల కోట్లు అవసరమవుతాయని అధికారులు తొలుత అంచనా వేశారు. ప్రస్తుతం రుణమాఫీకి రూ.31 వేల కోట్లే అవసరమవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా తెలిపారు. కానీ, రేషన్ కార్డు, పీఎం కిసాన్ నిబంధనలను పక్కాగా అమలు చేస్తే రుణమాఫీకి రూ.20–25 వేల కోట్లు సరిపోతాయని, తద్వారా రూ.6–11 వేల కోట్ల వరకు భారం తగ్గుతుందని అధికారులు ప్రభుత్వానికి స్పష్టం చేసినట్టు సమాచారం. ఇదేవిధంగా రైతుభరోసా పథకానికి పీఎం కిసాన్ నిబంధనలను అమలు చేయడంతోపాటు భూమిపై సీలింగ్ పెడితే రూ.10–15 వేల కోట్లు సరిపోతాయని, తద్వారా రూ.8–13 వేల కోట్ల భారాన్ని తగ్గించుకోవచ్చని చెప్పినట్టు తెలుస్తున్నది. ఈ లెక్కన ఈ రెండు పథకాలను గరిష్ఠంగా రూ.40 వేల కోట్లతో అమలు చేసి ప్రభుత్వం రూ.20 కోట్లకుపైగా భారాన్ని తగ్గించుకునే అవకాశమున్నదన్న చర్చ జరుగుతున్నది. కానీ, దీనివల్ల రైతులకు అంతే మొత్తంలో నష్టం జరుగుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంత భారీ మొత్తంలో రైతులకు నష్టం చేసే ఆలోచనలు చేయొద్దని, ఎలాంటి కొర్రీలు లేకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ, రైతుభరోసా పథకాలను అమలు చేయాలన్న డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి.

రాష్ట్రానికి మరో రూ.2000కోట్ల అప్పు

నెలాఖరుకు రూ.31 వేల కోట్లకు చేరనున్న అప్పు

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి మరో రూ.2000 కోట్ల అప్పు తీసుకున్నది. ఈ మేరకు మంగళవారం ఆర్బీఐ ప్రకటన విడుదల చేసింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం 31 వేల కోట్లకు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఈ నెలాఖరు వరకు మొత్తం రూ.16 వేల కోట్ల అప్పు పొందనుంది. గత మార్చి వరకు రూ.15 వేల కోట్ల రుణం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరు నాటికి మొత్తం రూ.31 వేల కోట్లకు రాష్ట్ర అప్పు చేరనుంది. ఆరు గ్యారంటీల అమలు, పంట రుణమాఫీ నేపథ్యంలో ఆర్బీఐ నుంచి ప్రభుత్వం రుణాలు పొందుతున్నట్టు తెలిసింది.

రూ.300 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వ్యాప్తంగా రూ.300 కోట్ల వ్యయంతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటుచేసేందుకు ప్రఖ్యాత యూనివర్సిటీలు ముందుకొచ్చినట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. హైదరాబాద్ కేంద్రంగా 25 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహించే 'ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్'(ఐఎస్ఎఫ్), టెక్సాస్ కేంద్రంగా ఉన్న 'స్టార్టప్ రన్‌వే' సంస్థల ప్రతినిధులతో మంగళవారం సెక్రటేరియట్‌లోని తన కార్యాలయంలో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా స్టార్టప్‌లను ప్రోత్సహించే ఈ రెండు సంస్థలకు అమెరికాలోని యూనిర్సిటీ ఆఫ్ టెక్సాస్, యూకేలోని లండన్ బిజినెస్ స్కూల్ లాంటి పది ప్రఖ్యాత యూనివర్సిటీలతో శిక్షణకు సంబంధించిన ఒప్పందాలున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు నగరంలో జరిగే ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ సదస్సులో ఈ యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఐఎస్ఎఫ్ చైర్మన్ డాక్టర్ జేపీ దరి, డైరెక్టర్ శేషాద్రి వంగల ఆధ్వర్యంలో రిచర్డ్‌సన్, ఫ్రిస్కో నగరాల ప్రతినిధులు మంత్రిని కలిసి తెలంగాణలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ'లో సంయుక్తంగా కార్యకలాపాలు చేపట్టేందుకు ఆసక్తి చూపినట్టు తెలిపారు. సమావేశంలో ఫ్రిస్కో మాజీ మేయర్ మహెర్ మేసో, క్రిష్‌షాక్లెట్, గ్రెగ్‌సోవెల్, స్టార్టప్ రన్‌వే వ్యవస్థాపకుడు మహేశ్ నంద్యాల, సీఓఓ రవీంద్రరెడ్డి, చిన్మయ్‌దాస్, జ్యోత్స్న కొండపులి, అర్చన చిందం, వేణుమాధవ్ గొట్టుపుల్ల ఉన్నారు.

Hall Ticket

Post Applied District	YADADRI BHUVANAGIRI
Category of the Post	School Assistant (Mathematics)
Medium of the Post	Telugu
Registration No.	: TR202405343141
Applicant Name	: RAMCHANDRAIAH VALLEPU
Father Name	: NARSHIMULU
Mother Name	: RAMULAMMA
Date of Birth	: 14-06-1977
Community	: BC-A
Gender	: Male
Is Differently Abled	: Yes

అబ్బాయి ఫొటోకు బదులు అమ్మాయి ఫొటో, సంతకంతో వచ్చిన డీఎస్సీ హాల్‌టికెట్

అబ్బాయికి బదులు అమ్మాయి ఫొటో

డీఎస్సీ హాల్‌టికెట్‌లో విద్యాశాఖ నిర్వాకం

జవహర్‌నగర్, జూలై 16 : డీఎస్సీ హాల్‌టికెట్‌లో అబ్బాయి ఫొటోకు బదులు అమ్మా యి ఫొటో, సంతకం వచ్చింది. దీంతో నివ్వెరపోయిన అభ్యర్థి విద్యాశాఖ నిర్లక్ష్యంపై మండిపడ్డాడు. దమ్మాయిగూడ బాలాజీనగర్‌కాలనీకి చెందిన రాంచంద్రయ్య వల్లెపు డీఎస్సీ రాస్తున్నాడు. హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోగా వివరాలు సక్రమంగానే ఉన్నా.. ఫొటో, సంతకం మాత్రం అమ్మాయిది రావడంతో కంగుతిన్నాడు. అధికారులు చేసిన పొరపాటుతో 31న నిర్వహించే పరీక్షను రాసేది ఎలా..? అని వాపోతున్నాడు. అధికారులు హాల్‌టికెట్‌లో తప్పులను సవరించి కొత్తది మంజూరు చేయాలని కోరుతున్నాడు.

జీ-శాట్ 16 సిగ్నల్ కట్

పట్టించుకోని రాష్ట్ర ఐటీ శాఖ

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం పట్టింపులేని చర్యల వల్ల జీ-శాట్ 16 ప్రసారాలు శాశ్వతంగా నిలిచిపోనున్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కేయూ బ్యాండ్ జీ –శాట్ 16 శాటిలైట్ సేవల కోసం ఎంవోయూ పునరుద్ధరణ సకాలంలో పూర్తి కాకపోవడంతో సిగ్నల్స్‌ను నిలిపివేస్తున్నట్టు మంగళవారం కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ ఈనెల 5న జీ-శాట్‌కు శాటిలైట్ సేవల పునరుద్ధరణ విషయంలో ఒప్పందం చేసుకోవాలని లేఖ రాసింది. 10 రోజులు గడిచినా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకించి ఐటీ శాఖ దీనిపై పట్టించుకోకపోవడమే కారణంగా తెలుస్తున్నది. టీ-శాట్ నెట్‌వర్క్ చానెల్స్‌కు సీఈవో నియామకం విషయంలో సంబంధిత శాఖ మంత్రి శ్రీధర్ బాబు కినుక వహించారని, ఈ క్రమంలోనే ఆయన ఎంవోయూ పునరుద్ధరణకు ఆసక్తి చూపడంలేదనే ప్రచారం సాగుతున్నది. రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత టీ-శాట్‌ను పునరుద్ధరించింది. నాటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని, సీఈవోగా సీనియర్ జర్నలిస్టు శైలేశ్‌రెడ్డి సారథ్యంలో దాదాపు పదేండ్లపాటు ఉద్యోగార్థులు, విద్యార్థులకు 'నిపుణ', 'విద్య' అని రెండు చానెళ్లను కొనసాగాయి.

ప్రసారాలకు ఇబ్బంది లేదు : సీఈవో వేణుగోపాల్‌రెడ్డి

టీ –శాట్ నెట్‌వర్క్ చానల్స్ ప్రసారాలకు ఎటువంటి ఇబ్బంది లేదని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. జీ శాట్ 8 సిగ్నల్‌లో విద్య, నిపుణ చానల్స్ ప్రసారాలు యాథావిధిగా కొనసాగుతున్నాయని తెలిపారు. జీ-శాట్ టెస్ట్ సిగ్నల్ మాత్రమేనని, కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు త్వరలో కొత్త జీ –శాట్ 16 ఒప్పందం చేసుకుంటామని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో మూగబోయిన టీ-శాట్: కేటీఆర్

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): పేద విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉచితంగా కోచింగ్ ఇస్తున్న తెలంగాణ ప్రభుత్వ టీ–శాట్ టీవీ చానళ్లు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో నేడు మూగబోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో తెలంగాణలో విద్యార్థులు, నిరుద్యోగులు నష్టపోతున్నారని మంగళవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్‌తో చేసుకోవలసిన ఒప్పందంపై జీశాట్ 16 శాటిలైట్ సేవలను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్ఎస్ఐఎల్ విరమించుకుందని వాపోయారు. టీ–శాట్ నెట్‌వర్క్ సేవలను తక్షణమే పునరుద్ధరించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.